Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143



WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774



Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 106 | Wednesday 26.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 106 | బుధవారం 26. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4


జగన్ అపర గోబెల్స్ లా...

## మాట్లాడుతున్నారు

### : గోరంట్ల బుచ్చయ్య చౌదరి

జగన్ పై గోరంట్ల విమర్శలు

మూడేళ్లలో మళ్లీ అధికారంలోకి వస్తామంటున్నారని వెల్లడి

జగన్ వచ్చేది రాజమండ్రి సెంట్రల్ జైలుకేనని ఎద్దేవా



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ అపర గోబెల్స్‌లా మాట్లాడుతున్నారని, మరో మూడేళ్లలో అధికారంలోకి వస్తానని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అయితే, ఆయన వచ్చేది రాజమండ్రి సెంట్రల్ జైలుకేనని జోస్యం చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్, మైనింగ్ కుంభకోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. జగన్ మళ్లీ జైలు జీవితం గడపవలసి వస్తుందని స్పష్టం చేశారు. జగన్ పాలనలో పంటలకు బీమా మిగతా 2 లో



కలెక్టర్ల పనితీరును నిరంతరం...

# సమీక్షిస్తాం

ప్రజలే ఫస్ట్...ఇదే మన విధానం

: జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు రెండ్రోజుల సమావేశాలు

నేడు తొలి రోజు సమావేశం - చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్లకు కర్తవ్య బోధ

కలెక్టర్ల పనితీరు ప్రజలపై శాశ్వత ప్రభావం చూపుతుందని వెల్లడి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, గత తొమ్మిది నెలలుగా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచిందని, ఆ నష్టాన్ని అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో జరిగిన తొలిరోజు కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ప్రజల కోసం, జిల్లాల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఒక ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ల పనితీరు ప్రజలపై శాశ్వతమైన ప్రభావం చూపుతుందని, వారి పనితీరును నిరంతరం సమీక్షిస్తామని అన్నారు. ప్రజా సంక్షేమం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు గౌరవంగా అందించాలని, ప్రతి అధికారి 'ప్రజలే ఫస్ట్' అనే విధానంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న 22 రకాల సేవలకు సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నామని, ఈ ప్రభుత్వం తమ కోసమే పనిచేస్తోందనే నమ్మకం ప్రజల్లో కలిగించాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మిగతా 2 లో

షిహాన్ హుసైని గారి ఆత్మకు...

## శాంతి చేకూరాలి..

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ప్రముఖ మార్షల్ ఆర్ట్స్, ఆర్చరీ శిక్షకులు, సీనియర్ నటుడు షిహాన్ హుసైని (60) బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ మంగళవారం ఉదయం కన్నుమూశారు. ఆయన మరణ వార్తపై సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలియజేస్తున్నారు. ఇక ఆయన ఆధ్వర్యంలోనే హీరో, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కరాటేని నేర్చుకున్నారు. తన గురువు మరణించడంతో పవన్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. "ప్రముఖ మార్షల్ ఆర్ట్స్, ఆర్చరీ శిక్షకులు షిహాన్ హుసైని గారు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. నేను ఆయన వద్దే కరాటే శిక్షణ పొందాను. మార్షల్ మిగతా 2 లో

టీడీపీ, వైసీపీ పార్టీలవి...

## నీచ రాజకీయాలు

: పెట్రో ధరలపై భగ్గుమన్న షర్మిల

పొరుగు రాష్ట్రాల్లో కంటే ఏపీలో పెట్రో ధరలు ఎక్కువగా ఉన్నాయన్న షర్మిల

గతంలో 17 రూపాయలు తగ్గించాలని చంద్రబాబు డిమాండ్ చేశారని వెల్లడి

ఇప్పుడు అధికారంలో ఉన్నందున మాట నిలబెట్టుకోవాలని షర్మిల డిమాండ్

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్ మీద పన్నులు తగ్గింపుపై టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచ రాజకీయాలు అని విమర్శించారు. ప్రతిపక్షంలో ఒక మాట... అధికారపక్షంలో మరో మాట... గత మిగతా 2 లో



ఏ రాష్ట్రానికైనా...

## రాజధాని అవసరం

మంత్రి నారాయణ

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** ఏపీ రాజధాని అమరావతి లో మంత్రి నారాయణ మంగళవారం పర్యటించారు. ఇప్పటికే పలు పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తి చేశారు. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల బంగ్లాలను, సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఏ రాష్ట్రానికి అయినా రాజధాని అవసరమని, ప్రస్తుతం రాజధాని లేని రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. గత టీడీపీ హాయంలో రూ. 43 వేల కోట్లకు టెండర్లు పిలిచామని, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా సర్వీస్ భవనాలు దాదాపు పూర్తయ్యాయని మిగతా 2 లో



ఐటీ, అడ్వాన్స్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి...

## సిస్కోతో ఒప్పందం

ఈ ఒప్పందం ద్వారా 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో ఉన్నత విద్య (డిగ్రీ, ఇంజనీరింగ్), వృత్తివిద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఐటీ, అడ్వాన్స్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రఖ్యాత ఐటీ సంస్థ సిస్కో, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నడుమ ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాల ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సిస్కో విద్యార్థుల్లో డిజిటల్ మిగతా 2 లో



రైతుల జీవితాలతో...

## చెలగాటలొద్దు..: మాజీ మంత్రి

మహబూబ్‌నగర్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రైతుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వార్నింగ్ ఇచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హన్వాడ మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామంలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులకు ఇస్తామని చెప్పిన రైతు బంధు ఇవ్వండి.. రుణమాఫీ చేయండి. వడగండ్ల వానతో మిగతా 2 లో



# సంపాదకీయం

## పదేళ్లలో ఇండియా జీడీపీ డబుల్

భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది. కాస్త మందగమనం ఉన్నప్పటికీ.. అనేక విషయాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ముందంజలోనే ఉంది. ఈ క్రమంలో ఈజ25లో భారతదేశ జీడీపీ వృద్ధి గత 10 సంవత్సరాలలో రెట్టింపు అయింది. 2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 4.3 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేయడం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన డేటాలో ఈ సమాచారం ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడం వల్ల, భారతదేశ జీడీపీ 2025లో జపాన్, 2027లో జర్మనీ కంటే ముందు వరుసలో నిలవనుంది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. ఇది విధాన సంస్కరణలు, బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా పేర్కొంది. 10 సంవత్సరాలలో భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిని రెట్టింపు చేసి 105 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఐఎంఎఫ్ డేటా తెలిపింది. 2015లో 2.1 ట్రిలియన్ డాటర్ల నుండి 2025లో 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. గతంలో పోల్చితే, అదే కాలంలో అమెరికా 66 శాతం, చైనా జీడీపీ 44 శాతం పెరిగాయి. దీంతో, భారతదేశం ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్ (30.3 ట్రిలియన్ డాలర్లు), చైనా (19.5 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4.9 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.4 ట్రిలియన్ డాలర్లు) తర్వాత ప్రపంచంలో వరంగా ఐదవ అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం, గత దశాబ్దంలో జపాన్ జీడీపీ సున్నాగా పెరగడంతో, భారతదేశం త్వరలో జపాన్‌ను అధిగమించనుంది. గత దశాబ్దంలో యునైటెడ్ కింగ్‌డమ్ జీడీపీ 28 శాతం వృద్ధి చెందగా, ఫ్రాన్స్ జీడీపీలో 38 శాతం వృద్ధిని సాధించింది. 2015లో 2.4 ట్రిలియన్ డాలర్ల నుండి 2025 నాటికి 3.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 50 శాతం కంటే ఎక్కువ జీడీపీ వృద్ధిని సాధించిన ఇతర అగ్ర ఆర్థిక వ్యవస్థలు రష్యా (57 శాతం), ఆస్ట్రేలియా (58 శాతం), స్పెయిన్ (50 శాతం)గా ఉన్నాయి. భారతదేశ జీడీపీ వృద్ధిని అపూర్వమైన రేటుతో చూపిస్తున్న డేటాను బిజెపి మంత్రి అమిత్ మాల్వియా తన అధికారిక చీ పోస్ట్ ద్వారా పంచుకున్నారు.ఈ వృద్ధి వేగం భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక సూపర్ పవర్‌గా నిలబెట్టింది. 2025 నాటికి జపాన్‌ను, 2027 నాటికి జర్మనీని అధిగమిస్తుందని బీజేపీ నాయకుడు అమిత్ మాల్వియా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో షేర్ చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ అసాధారణ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి, ఆయన ప్రభుత్వ అవిశ్రాంత కృషికి నిదర్శనమని మాల్వియా పేర్కొన్నారు. చురుకైన ఆర్థిక విధానాలు, సాహసోపేతమైన నిర్మాణాత్మక సంస్కరణలు, వ్యాపారాన్ని సులభతరం చేయడంపై అవిశ్రాంత దృష్టి ద్వారా, మోదీ ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మార్చింది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మునుపటి ఏ ప్రభుత్వం సాధించని విజయం ఇది అని అమిత్ మాలవ్య అన్నారు. మార్చి నెల ప్రారంభంలో, భారతదేశం వివేకవంతమైన విధానాలను ప్రశంసిస్తూ, ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు, దేశం బలమైన ఆర్థిక పనితీరు 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారడానికి కీలకమైన సంస్కరణలను స్వీకరించడంలో సహాయపడుతుందని పేర్కొంది. అధిక-నాణ్యత ఉద్యోగాలను సృష్టించడానికి, దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి నిర్మాణాత్మక సంస్కరణలు చాలా కీలకమని ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు పేర్కొంది.దేశ జీడీపీలో ప్రైవేట్ వినియోగం వాటా పెరిగినందున దేశ ఆర్థిక వృద్ధి మరింత సమతుల్యంగా మారుతోందని ఇటీవల విడుదలైన క్రిసిల్ నివేదిక వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75-100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు.దేశంలో ప్రైవేట్ వినియోగం నానాటికీ పెరుగుతుంది. ఇది ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ, గృహ పెట్టుబడులు రెండూ వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడులు ఇంకా ఆశించినంతగా పుంజుకోలేదు. కొనసాగుతున్న సుంకాల యుద్ధాలు, చైనా డంపింగ్ భయం కారణంగా కార్పొరేట్ రంగం పెట్టుబడులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. టారిఫ్‌ల వల్ల వచ్చే నష్టాల సంక్లిష్టత ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే నెలల్లోనూ ఇది కొనసాగే అవకాశం ఉంది. దీంతో మా అంచనాలకు ప్రతికూలతలు సృష్టిస్తుందని జోషి అన్నారు.

# కలెక్టర్ల పనితీరును నిరంతరం...



విజన్ 2047 ఒక దిక్సూచిలాంటిదని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయం వరకు ప్రణాళికలు ఉండాలని, జిల్లాలో కలెక్టర్ విజన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. రాష్ట్రంలో రూ.55 వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయని, వాటిని రెండేళ్లలో పూర్తి చేయాలని, పర్యావరణ అనుమతుల కోసం కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆమోదం పొందేలా పాలన ఉండాలని, గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం కారణంగా ప్రజల్లో అసహనం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. కూటమికి 93 శాతం స్ట్రైక్‌రేట్ రావడానికి ఇదే కారణమని, ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే తగినంత ఆదాయం ఉండాలని, అప్పులతో చేస్తే అవి స్థిరంగా ఉండవని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్లు అప్పులు చేసిందని, వాటిని తీర్చడానికి వడ్డీలు కట్టాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలని, మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులు రావాలని ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే 5 ఏళ్లలో గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు సాధించేలా ముందుకెళుతున్నామని, పర్యాటకంలో 20 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. జీఎస్టీపై సమీక్షలు చేసి బకాయిలు వసూలు చేయాలని, పన్ను ఎగవేతదారుల పట్ల కఠినంగా ఉండాలని నిర్దేశించారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను కూడా ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మున్సిపల్ శాఖలో ఫిర్యాదులు రాకుండా ఉన్నప్పుడే బాగా పనిచేసినట్లు భావిస్తామని, శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దని, గంజాయి సరఫరా చేసి, రౌడీయిజం చేసేవారి పట్ల ఉక్కుపాదం మోపాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కలెక్టర్లు జిల్లా ఎస్పీలతో కలిసి పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు.

## ఐటీ, అడ్వాన్స్డ్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి...





నైపుణ్యాలను విస్తరించడానికి నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి రంగాలలో అత్యాధునిక కంటెంట్‌ను అందిస్తుంది. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఏ కోర్సుల్లో శిక్షణ అందించాలో ఉన్నత విద్యాశాఖ నుంచి ప్రాధాన్యతల ఆధారంగా కోర్సుల జాబితాను ఖరారు చేస్తారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. ఈ ఒప్పందం ద్వారా 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధికి సిస్కో శిక్షణ అందించనుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, ఉపాధిని పెంపొందించడమే ఈ సహకారం లక్ష్యం. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించేలా సిస్కో వర్చువల్ విధానంలో NetAcad పోర్టల్ ద్వారా స్వీయ-అభ్యసన, బోధకుల నేతృత్వంలో ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ ప్రాక్టికల్ ఎక్స్ పీరియన్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంది. విద్యార్థులకు ఆయా సంస్థల డిమాండ్ ఆధారిత కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను డిజైన్ చేస్తారు. మారుతున్న సాంకేతికలకు అనుగుణంగా ముందస్తు అవసరాలకు సరిపడా సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. స్వీయ-అభ్యసన (సెల్ఫ్ లెర్నింగ్) కోర్సుల్లో అవగాహన పెంచడం, విద్యార్థులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశం. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అవసరాలకు అనుగుణంగా లెర్నర్ పార్టిసిపేషన్, కాంపిటీషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, వర్క్ షాప్స్ నిర్వహణ వంటివి ఏపీఎస్ఎస్ డీసీ చేపడుతుంది. ఆయా కోర్సుల్లో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు, ఉద్యోగులకు సిస్కో సర్టిఫికెట్లను జారీచేస్తుంది. ఏపీఎస్ఎస్ డీసీ ద్వారా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ లను అందిస్తారు. ఐటీ కెరీర్ లో యువతులకు మద్దతు నిచ్చే ఉమెన్ రాక్ ఐటీ (డబ్ల్యూఆర్ఐటీ), అధునాతన టెక్నాలజీలో యువత, విద్యార్థులకు మద్ధతునిచ్చే ఫైండ్ యువర్ సెల్ఫ్ ఇన్ ద ఫీచర్(ఎఫ్‌వైఐఎఫ్) వంటి ప్రోగ్రామ్ లను సిస్కో సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుంది. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ దేడ్రిచ్, గవర్నమెంట్ అఫైర్స్ డైరెక్టర్ హరీశ్ కృష్ణన్, సేల్స్ బిజినెస్ డెవలప్ మెంట్ డైరెక్టర్ కె. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ రాష్ట్రానికైనా...

తెలిపారు. కానీ గత ప్రభుత్వం (జగన్ సర్కార్) ఇవేమీ పట్టించుకోలేదని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అనేక ఇబ్బందులు వచ్చాయన్నారు. ఐఐటీ మద్రాస్‌ను పిలిచి బిల్డింగ్ నాణ్యత పరిశీలించి, కాంట్రాక్టర్లతో చర్చించి కొన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. 90 శాతం పనులు టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. మొదట క్లీనింగ్‌తో పనులు మొదలు అయ్యాయన్నారు. ఇవాళ సెక్రెటరీ.. ప్రిన్సిపాల్ కార్యదర్శి బంగళాలు పరిశీలించామన్నారు. 186 బంగాళాలు మంత్రులు, జడ్జీలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు వస్తున్నాయన్నారు. గెజిటెడ్ అధికారులకు 1440,ఎన్జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయని తెలిపారు. అలాగే హై కోర్ట్ 16.85 లక్షల చదరపు అడుగులు వస్తుందన్నారు. అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో ఉంటుందని, 15 రోజుల్లో కాంట్రాక్టర్ల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని నారాయణ తెలిపారు. ప్రజలపై ఒక్క పైసా భారం కూడా లేకుండా రాజధాని నిర్మాణం పూర్తి అవుతుందని, వరల్డ్ బ్యాంక్.. ఎడిబి నుంచి రుణాలు తీసుకున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ వాల్యూ పెరిగిన తర్వాత. అప్పు తీర్చడం జరుగుతుందన్నారు. ప్రజల డబ్బు వృథా చేస్తున్నారని ప్రతిపక్షం చెబుతోందని.. ఇది సరికాదని మంత్రి అన్నారు. మరోవైపు విశాఖ జిల్లా, భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు.ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, ఇతర ట్రాఫిక్ సమస్యలపై నాలుగు రోజుల క్రితం విశాఖ స్థానిక నేతలతో చర్చించామన్నారు. వీఎంఆర్డీఏ పరిధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేశామని తెలిపారు. ఫైనల్ చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైన్లో ఉంచుతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని.. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# ఛెన్నైలో బీఆర్ఎస్, కాంగ్రెస్ చెట్టాపట్టాల్ ?

హైదరాబాద్ : సీఎం రేవంత్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య ఏ అంశంలోనూ ఏకాభిప్రయం ఉండదని అనుకుంటారు. కానీ.. దక్షిణాదికి అన్యాయం విషయంలో ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం వచ్చింది. స్టాలిన్ నేతృత్వంలో పోరాడేందుకు వారు సిద్ధమయ్యారు. శనివారం చెన్నైలో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కీలక పార్టీల నేతల సమావేశానికి రేవంత్ తో పాటు కేటీఆర్ కూడా హాజరయ్యారుభారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం చెన్నైకి వెళ్లింది. డీలిమిటేషన్ విధానంపై చర్చించేందుకు చెన్నైలో జరగనున్న దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రస్తుత డీలిమిటేషన్ విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న , భవిష్యత్తులో జరగబోయే నష్టాలను ఎండగడుతూ, ఈ అన్యాయాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేటీఆర్ ప్రసంగించారు. కేటీఆర్ నాయకత్వంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులతో కూడిన బృందం ఈ సమావేశంలో పాల్గొంది. ప్రస్తుత డీలిమిటేషన్ విధానం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని బలహీనపరుస్తుందని, దీని వల్ల దేశ ఆర్థికాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న ఈ రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆది నుంచి ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్, తన పార్టీ విధానాన్ని సమావేశంలో వివరించింది. దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి, దాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, ఈ అంశంలో అందరికన్నా ముందుండి పోరాడుతున్న పార్టీ భారత రాష్ట్ర సమితి అని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, దేశ ప్రగతికి బాటలు వేసిన ఈ రాష్ట్రాల ప్రజల భవిష్యత్తు కోసం కలిసి నిలబడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల ఐక్యతను బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డీలిమిటేషన్ విధానంపై బలమైన వ్యతిరేకతను కేంద్రానికి చాటనుందని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది.మరో వైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ హాజరయ్యారు. కర్ణాటక నుంచి డిప్యూటీ సీఎం శివకుమార్ హాజరు కాగా... తెలంగాణ సీఎం కూడా హాజరవ్వాలని శుక్రవారమే నిర్ణయించుకున్నారు.. స్టాలిన్ ఇండియా కూటమిలో కీలక నేత. ఆయన నిర్వహించే సమావేశానికి స్థాయి తగ్గకండా వెళ్లాలని హైకమాండ్ సూచించడంతో రేవంత్ కూడా వెళ్లారు. ముందుగా పీసీసీ చీఫ్ ను పంపాలనుకున్నారు.ఇప్పుడు ఇద్దరూ చెన్నైకి చేరుకున్నారు.ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో కాంగ్రెస్ పై పోరాడుతోంది.మరో వైపు ఆ పార్టీ తో కలిసి బీజేపీపై పోరాడేందుకు సిద్ధమవుతోంది. ఇది తెలంగాణలో కొన్ని రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ బీజేపీని .. బీఆర్ఎస్ పల్లెత్తు మాట అనడం లేదు. ఇప్పుడు కాంగ్రెస్ తోనూ కలిసి పని చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీన్ని బీఆర్ఎస్ ఎలా తన రాజకీయ విధానాలకు అనుగుణంగా మార్చుకుంటారన్నది ఆసక్తికరం.

# జగన్ అపర గోబెల్స్ లా...

చెల్లించకపోవడంతో రైతులు వేల కోట్ల రూపాయలు నష్టపోయారని గోరంట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గ్రామాల్లో కనీసం రోడ్లు కూడా వేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలను ఆదుకుంటున్నామని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మే నెలలో తల్లికి వందనం, జూన్‌లో అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రానున్న పుష్కరాలకు రాజమండ్రి, దాని పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఇక, రాజమండ్రిలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మాణం జరగనుందని, ఈ విషయమై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నితో చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. గతంలో వైసీపీ కార్యాలయానికి అధికారులు వెంటనే స్థలం కేటాయించారని, టీడీపీ కార్యాలయానికి స్థలం అడుగుతున్నా ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు.నియోజకవర్గాల పునర్విభజనపైనా గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ అంశంపై కేంద్రంతో అంతర్గతంగా చర్చిస్తున్నారని తెలిపారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నందున ఈ విషయాన్ని బహిరంగంగా వెల్లడించకూడదని ఆయన పేర్కొన్నారు. జనాభా విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ఎంతో బాధ్యతగా వ్యవహరించాయని, ఇప్పుడు జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గించడం సముచితం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

## టీడీపీ, వైసీపీ పార్టీలవి...

10 ఏళ్లుగా ఈ రెండు పార్టీల ప్రభుత్వాలు చేసింది దారి దోపిడీ తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. వ్యాట్ పేరుతో ఏ రాష్ట్రంలో లేనంతగా ప్రజలపై పన్ను పోటు విధించారని ఆరోపించారు. దేశంలోనే అత్యధిక పన్నులు వేసిన రాష్ట్రంగా ముందువరసలో పెట్టి... రాష్ట్ర ప్రజానీకాన్ని లూటీ చేశారని షర్మిల మండిపడ్డారు. "ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 109.60, డీజిల్ ధర రూ. 97.47గా ఉంది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో పెట్రోల్ రూ. 100.86, డీజిల్ రూ. 92.39బీ కర్ణాటకలో పెట్రోల్ రూ. 102.90, డీజిల్ రూ. 88.99బీ తెలంగాణలో పెట్రోల్ రూ. 107.46, డీజిల్ రూ. 95.70గా ఉన్నాయి. ఈ లెక్కల ప్రకారం, ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోంది" అని షర్మిల వివరించారు. చంద్రబాబు విపక్ష నేతగా ఉన్నప్పుడు లీటరుకు రూ. 17 తగ్గించాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. గతంలో జగన్ కూడా పెట్రోల్, డీజిల్ ధరలపై విమర్శలు చేసి, అధికారంలోకి వచ్చాక వాటిని పెంచారని గుర్తు చేసింది. రెండు పార్టీలు కలిసి ప్రజల నుంచి రూ. 50 వేల కోట్లు వసూలు చేశాయని ఆరోపించారు. "కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఇంధనం ధరలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు మీరు అధికారంలో ఉన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎప్పటి నుంచి ధరలు తగ్గిస్తారో సమాధానం చెప్పాలి. 17 రూపాయలు ధర తగ్గించి ఇచ్చిన హామీ వెంటనే నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

## షిహాన్ హుసైని గారి ఆత్మకు...

ఆర్ట్స్ గురు హుసైని గారు అనారోగ్యంతో బాధపడుతున్నారని నాలుగు రోజుల కిందటే తెలిసింది. వారి ఆరోగ్యం గురించి చెన్నైలోని నా మిత్రుల ద్వారా వాకబు చేసి, విదేశాలకు పంపించి మెరుగైన వైద్యం చేయించాల్సి ఉంటే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని తెలిపాను. అలాగే ఈ నెల 29వ తేదీన చెన్నై వెళ్లి హుసైని గారిని పరామర్శించాలని నిర్ణయించుకొన్నాను. ఇంతలో దుర్వార్త వినాల్సి రావడం అత్యంత బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.చెన్నైలో హుసైని గారు కరాటేను చాలా కఠినమైన నియమ నిబంధనలతో నేర్పేవారు. ఆయన చెప్పినవి కచ్చితంగా పాటించేవాడిని. తొలుత ఆయన కరాటే నేర్పేందుకు ఒప్పుకోలేదు. 'ప్రస్తుతం శిక్షణ ఇవ్వడం లేదు, కుదరదు' అన్నారు. ఎంతో బతిమాలితే ఒప్పుకొన్నారు. తెల్లవారుజామునే వెళ్లి సాయంత్రం వరకూ ఆయన దగ్గర ఉంటూ కరాటేలో బ్లాక్ బెల్ట్ శిక్షణ పొందాను. తమ్ముడు చిత్రంలో కథానాయక పాత్ర కిక్ బాక్సింగ్ నేర్చుకొనేందుకు కఠోర సాధన చేసే సన్నివేశాలకు- నాటి నా శిక్షణ అనుభవాలు దోహదం చేశాయి. హుసైని గారి శిక్షణలో సుమారు మూడు వేల మంది బ్లాక్ బెల్ట్ స్థాయికి చేరారు. హుసైని గారు తమిళనాడులో ఆర్చరీ క్రీడకు ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేశారు. ఆ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ లో ముఖ్య బాధ్యతలు నిర్వర్తించారు.హుసైని గారి ప్రతిభ మార్షల్ ఆర్ట్స్, ఆర్చరీ రంగాలకే పరిమితం కాలేదు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీతంలో ప్రావీణ్యం ఉంది. చక్కటి చిత్రకారులు, శిల్పి. పలు చిత్రాల్లో నటించారు. స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేసేవారు. చెన్నై రోటరీ క్లబ్, ఇతర సమావేశ మందిరాల్లో ప్రసంగించేందుకు వెళ్తుంటే వెంట తీసుకువెళ్లేవారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన హుసైని గారు మార్షల్ ఆర్ట్స్ ను యువతీయువకులకు మరింత చేరువ చేయాలని ఆకాంక్షించేవారు. మరణానంతరం తన దేహాన్ని మెడికల్ కాలేజీకి అందచేయాలని ప్రకటించడం-ఆయన ఆలోచనా దృక్పథాన్ని వెల్లడించింది. హుసైని గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను" అని పత్రికా ప్రకటనలో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## రైతుల జీవితాలతో...


పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.. వాటికీ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు నష్టపోకుండా మొలకెత్తినా వడ్లను కూడా కొనుగోలు చేశామని గుర్తు చేశారు. వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేల సహాయం అందించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ అయిందని అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రులు క్షేత్ర స్థాయిలోకి వస్తే వాస్తవాలు తెలుస్తాయి. ప్రభుత్వం రైతుల పాలిట నిర్లక్ష్యం వహిస్తే మరో పోరాటానికి రైతులు సిద్ధమవుతారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుంది. కాంగ్రెస్ అసమర్థ పాలన వల్ల నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. పంట నష్టపోయిన రైతుల వివరాలని ప్రభుత్వానికి పంపించాలి. మహబూబ్ నగర్ మండల పరిధిలోని చాలా గ్రామాల్లో పంట దెబ్బతిన్నదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారి వెంట మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, రైతు కమిటీ అధ్యక్షులు కొండయ్య, సీనియర్ నాయకులు నెత్తికొప్పుల శ్రీను, చెన్నయ్య, జంబులయ్య, పెద్ద చెన్నయ్య, రాజుయాదవ్, అనంత రెడ్డి, బాలకిష్టయ్య, హరీష్ చందర్, వెంకన్న, మాధవులు, శ్రీనివాసులు, వెంకటయ్య, తిరుపతయ్య, బలవర్ధన్, రామకృష్ణ ఉన్నారు.

## కుప్పంపట్టణ సీఐ శంకరయ్య సూచనల మేరకు....
## విగ్రహాల పరిరక్షణకు సీసీ కెమెరాలు



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: కుప్పం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు, విగ్రహాల పరిరక్షణలో భాగంగా పట్టణ సీఐ శంకరయ్య సూచనల మేరకు కుప్పం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ లు సిసి కెమెరాలను వితరణ చేయగా పట్టణ సిఐ శంకరయ్య, పోలీసు సిబ్బంది దగ్గరుండి నాయకుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది.

## నవోదయకి ఎంపికైన జస్విన్



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: వెదురుకుప్పం మండలం వావిలిచెను గ్రామనికి చెందిన బాలాజీ రెడ్డి, కుమారు డు జస్విన్ పెనుమూర్ లోని శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో 5వ తరగతి చదువు తున్న జస్విన్ నవోదయ కి ఎంపిక అవడం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాం డెంట్ చిరంజీవి రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, హెడ్ మాస్టర్ మునస్వామి అభినందనలు తెలియజేసారు.

## ఇంటింటికీ .....
## చెత్త బుట్టలు పంపిణీ కార్యక్రమం



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: గొడుగుచింత గ్రామంలో ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నక్కా బాబు, సెక్రటరీ నరేష్, నాయ కులు మధు, ముని, భాస్కర్ నాయుడు, దాము, నవీన్ నాయుడు, వెంకటాద్రి, కె మురళి మరియు గ్రామస్తులు ...ఈ సంద ర్భంగా పరిసరాల పరిశుభ్రత, ఇంటి నుంచి చెత్త సేకరణ మొదలగు విషయాలపై అవ గాహన కల్పించడం జరిగింది.

## నవోదయ ప్రవేశ పరీక్షలో ....
## శ్రీ భువన విద్యాలయం విద్యార్థుల విజయం




పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: అన్నమయ్య జిల్లాకు పీలేరు జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన జవహర్ నవో దయ విద్యాలయ ప్రవేశ పరీక్ష (జె ఎన్ వి ఎస్ టి 2025) ఫలితాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వలసపల్లి, మదనపల్లి మండలంలోని జవహర్ నవో దయ విద్యాలయంలో 80 ఖాళీలకు గాను పీలేరు, శ్రీభువన విద్యాలయం విద్యార్థులు వి.శ్రీదేవి, బి.అజయ్, వి.సుహాన తసీన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీ భువన విద్యాలయం కరస్పాండెంట్ ఉమా రమా దేవి, ప్రిన్సిపాల్ గుణ లక్ష్మి మాట్లాడుతూ, "మా పాఠశాలలో ఐదవ తరగతి చదివిన విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ తీసుకుని ఈ ఘనత సాధించడం, ఈ విజయానికి తోడ్పడిన పాఠశాల బోధన సిబ్బం దికి ఆమె ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా ఇఫ్తార్ విందు



పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలమనేరు నియోజకవర్గంలోని మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక నమాజ్ లో ముస్లిమ్స్ సోదరులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని అల్లాను ప్రార్థించారు. ఆ అల్లా చల్లని చూపుతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మైనారిటీల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, గతంలో మంజూరు చేసి ఆగిన పనులన్నింటినీ పూర్తి చేయిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులతో పాటు టీడీపీ ముఖ్య నాయకులు ఉన్నారు.

## సత్యవేడు టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి లైన్ క్లియర్.



సత్యవేడు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: కేటాయించిన భూమిలో రెవిన్యూ, తెలుగు గంగ అధికారులు జాయింట్ సర్వే. టిటిడి కి స్థలం కేటాయింపు ప్రక్రియ పూర్తి. ఇక టిటిడి ద్వారా పనులు ప్రారంభించడమే తరువా యి. శభాష్ ఎమ్మెల్యే అంటున్న సత్యవేడు వాసులు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొర వతో సత్యవేడు టిటిడి కళ్యాణ మండపం పనులు ప్రారంభానికి లైన్ క్లియర్ అయ్యిం ది. తన నియోజవర్గ కేంద్రమైన సత్యవేడు లో టిటిడి కళ్యాణ మండపం నిర్మించాలని కాళ్లరిగేలా తిరిగి ఎట్టకేలకు ఎమ్మెల్యే కళ్యా ణమండపం మంజూరు చేయించిన సంగతి తెలిసిందే. అయితే కళ్యాణమండపం నిర్మా ణా నికి కేటాయించిన భూమి రెవిన్యూ, తెలుగు గంగా ప్రాజెక్టు వారికి చెందినది కావడంతో సర్వే సమస్య తలెత్తి నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యం లో సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవ తీసుకొని రెవెన్యూ, తెలుగు గంగా ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యేతో పాటు టీటీడీ ఉన్నతాధికారుల సమక్షంలో రెవెన్యూ , తెలుగు గంగ ప్రాజెక్టు అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి, కళ్యాణ మండపానికి కేటాయించిన భూమిని సంపూర్ణ స్కెచ్ తో టిటిడి అధికారులకు అందించారు. దీంతో టిటిడి కళ్యాణ మండపం నిర్మాణ పనులు మొదలు పెట్టడానికి మార్గం సుగమం అయినట్లు అధికారులు వెల్లడించారు. అన్నీ తానే ముందుండి సర్వే చేయించి భూమిని టిటిడి అధికారులకు అప్పగించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేయాలని కోరారు. సత్యవేడులో టిటిడి కళ్యాణ మండపం నిర్మాణం వల్ల ఈ ప్రాంత పేద ప్రజలు తక్కువ ఖర్చుతో పెళ్ళిళ్ళు, శుభ కార్యాలు చేసుకునే అవకాశం దక్కుతుం దన్నారు. ఈ సర్వే ప్రక్రియకు సహకరించిన రెవిన్యూ, తెలుగు గంగ, టిటిడి అధికారు లకు, సర్వేయర్లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రాంతంలో టిటిడి కళ్యాణ మండపం మంజూరు చేయడంతో పాటు దాని నిర్మాణానికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కి శభాష్.. అంటూ సత్యవేడు తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రశంసల జల్లులు కురి పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పరమశివం (బాషా), శివానందం, కోళ్ల చిన్న, ఆరుళ్, తహశీల్దారు, టిటిడి ఉన్నతాధికారులు, తెలుగుగంగ ప్రాజెక్టు డీఈ, సర్పంచ్ రమేష్, బాబు, అధికారులు, ప్రజాప్రతి నిధులు, టిటిడి, రెవిన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.

## బాస్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉలగనాథన్ గణపతి..



వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజక వర్గం వీకోట మండలం పాము గాని పల్లి పంచా యతీ పాము గాని పల్లి గ్రామానికి చెందిన ఉలగనాథన్ కుమారుడు అయిన యు గణపతి కు రాష్ట్రస్థాయిలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న తమైన పదవి వరించింది. ఈ అవకాశాన్ని భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పిటిఎం శివప్రసాద్ నియమిం చడంపై ఉలగనాథను గణపతి అతనికి భారీగా ధన్య వాదాలు తెలియజేసినారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ నాపై ఎంతో అపారమైన నమ్మకంతో నా ప్రాణదాత పిటిఎం శివప్రసాద్ అన్న నాకు ఈ పదవి ఇవ్వడంతో నాకు మరింత బాధ్యత పెరిగిందని, నా వంతుగా ఆంధ్ర రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల కొరకు నిరంతరం పోరాటం చేస్తూ వారి అవసరాలకు, అభివృద్ధికి పాటుపడతానని నిరంతరం బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉంటానని తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం కల్పించిన కేంద్ర కమిటీకి మరొకసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని పత్రికాముఖంగా తెలియజేసినారు.

## ఆ ఊరికి ఏమైంది...
## గ్రామంలో ప్రతి ఇంటిలో క్యాన్సర్ పేషంట్

కాకినాడ, : ఒకరికి కాదు.. ఇద్దరికి కాదు.. ఏకంగా గ్రామంలో సుమారు 200 మందికి పైబడే కేన్సర్ వ్యాధి లక్షణాలు నిర్ధారణ అవ్వడం కలవరానికి గురిచేస్తోంది.. వైద్యపరీక్షల ద్వారా 23 మందికి కేన్సర్‌ను గుర్తించిన అధికారులు గ్రామంలో ఉన్న పరిస్థితిని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతితోపాటు ఉన్నతాధికారులకు వివరించారు.. ఇంకా గ్రామంలో ఎంతమందికి క్యాన్సర్ ఉందో తెలుసుకునే ప్రయత్నంలో నిమగ్నమైన అధికారులు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు.. ప్రాథమికంగా గ్రామంలో చాలా మంది చిన్నారుల్లో కూడా కాలేయ సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది.. ఇదిలా ఉంటే బలభద్రపురంలో క్యాన్సర్ కోరల్లో ప్రజలు చిక్కుకుంటున్న పరిస్థితిపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీలో కూడా ప్రస్తావించడంతో దీనిపై ప్రభుత్వ, అధికార యంత్రాంగం కూడా ప్రత్యేక దృష్టిసారించిన పరిస్థితి కనిపించింది.. బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ కోరలు చాస్తోందన్న వార్త గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొంటున్న పరిస్థితి కనిపిస్తోంది.. తమ ఒంట్లో ఏ క్యాన్సర్ రాకాసి ఉందోనన్న అనుమానాలు ఆ గ్రామస్తుల మాటల్లో కనిపిస్తున్నాయి.. ఎందుకంటే ఈగ్రామంలోనే ఇప్పటికే 23 మంది క్యాన్సర్ బారిన పడడం గమనార్హం. ఇంకా సుమారు 200 మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు సమాచారం. అయితే అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించకపోయినప్పటికీ తూర్పు గోదావరి జిల్లా వైద్యశాఖ, కాకినాడ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందాలు సారథ్యంలో గ్రామంలో 32 బృందాలుగా సర్వే చేస్తున్నారు.. అయితే ఇప్పటికే గ్రామంలో 23 మంది క్యాన్సర్ చికిత్సలో ఉండగా మరికొంత మందికి ఈ వ్యాధి ఉందన్న సమాచారంతో గ్రామంలో తీవ్ర భయాందోళన పరిస్థితి నెలకొంది.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే భలభద్రపురం గ్రామంలోనే గ్రాసిమ్ కెమికల్ ఇండస్ట్రీతో పాటు ఇతర పరిశ్రమలున్నాయి.. వీటినుంచి వెలువడే కాలుష్య వల్లనే గ్రామంలో ఈ భయంకర పరిస్థితులు నెలకొన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు భూగర్భంలో డంపింగ్ చేయడం వల్ల భూగర్భ జలాలు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. బలభద్రపురం గ్రామంలో సుమారు 10 వేల మంది జనాభా ఉండగా ఎవ్వరిని కదిపినా క్యాన్సర్ కలవరం స్పష్టంగా కనిపిస్తోంది.. ఏప్రిల్ 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బలభద్రపురం శివారు ప్రాంతంలో గ్రాసిమ్ ఇండస్ట్రీను ప్రారంభించారు.. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బలభద్రపురంలో క్యాన్సర్ కోరలు చాస్తోందని తన ప్రసంగంలో ప్రస్తావించారు. దీనిపై వైద్యఆరోగ్యశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకపోతే ఇప్పటికే గ్రామంలో చాలా మంది క్యాన్సర్ బారిన పడ్డారని, మరింత మందికి ఈ వ్యాధి ఉండే అవకాశం లేకపోలేదని, గ్రామంలో తక్షణ చర్యలు చేపట్టి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు క్యాన్సర్ కారకాలను గుర్తించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోపాటు వైద్యఆరోగ్యశాఖ మంత్రికి విన్నవించారు..

**చర్యలకు ఉపక్రమించిన ఆరోగ్యశాఖ :** తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల కలకలంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. బలభద్రపురంలో అత్యధిక క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని అనపర్తి ఎమ్మెల్యే అసెంబ్లీలో పేర్కొన్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో వెంటనే 31 మెడికల్ టీమ్ లను అక్కడికి పంపామన్నారు. నాన్ కమ్యూనకబుల్ 3.0 సర్వేలో భాగంగా నాన్ కమ్యూనకబుల్ డిసిజ్ క్యాన్సర్ స్క్రీనింగ్ మొదలు పెట్టామని వెల్లడించారు. ఇప్పటివరకు కోటి 93 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించగా వీరిలో లక్ష 45వేల 649 మంది వేర్వేరు క్యాన్సర్లతో బాధపడుతున్న అనుమానిత కేసులు వచ్చాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు."బలభద్రపురానికి సంబంధించి 10800 మంది జనాభాలో 3500 ఇళ్లు ఉన్నాయి. వీరిలో 2803 ఇళ్ల వద్దకు వెళ్లి 8830 మందికి పరీక్షలు చేయగా 38 కేసులు బయటపడ్డాయి. దీనిలో గతంలో క్యాన్సర్ ఉన్న కేసులు ఉన్నాయి. భారత్ లో 14 లక్షల 13 వేల కొత్త కేసులు వచ్చాయి. లక్ష జనాభాకు 367 మంది అంటే 10 వేలు జనాభా ఉన్న బలభద్రపురంలో 32 కేసులు ఉన్నాయి. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాం. ఆయన అసెంబ్లీలో మాట్లాడటంతో మీడియాలో హైలెట్ అయ్యి అందరికీ తెలిసింది. అనపర్తి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుంటే లక్షా 19వేల మందికి స్క్రీనింగ్ చేయగా 736 సస్పెక్టెడ్ కేసులు వచ్చాయి. క్యాన్సర్ ట్రీట్ మెంట్ ను 2022-25 మధ్య ఎన్టీఆర్ వైద్య సేవ కింద లక్ష 13 వేల 363 మందికి చికిత్స చేశారు. బలభద్రపురంలో క్యాన్సర్ అనుమానిత కేసులు అసాధారణంగా పెరగలేదు. స్క్రీనింగ్ ట్రైన్డ్ సీహెచ్ సెంటర్లలో ఉండే వారు చేస్తారు. ఆశా వర్కర్లు కాదు" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**కృష్ణబాబు- ప్రిన్సిపల్ సెక్రటరీ, వైద్యారోగ్య శాఖ**

క్యాన్సర్ ను కన్ ఫామ్ చేయడానికి చేసే పరీక్ష బయాప్సీ మాత్రమే. మిగిలిన పరీక్షలన్నీ రూలౌట్ చేయడానికే. కేజీహెచ్, గుంటూరు, కర్నూలులో క్యాన్సర్ ట్రీట్ మెంట్ సౌకర్యాలు ఉన్నాయి. తొలి స్టేజ్ లో డయాగ్నోజ్ చేస్తే లైఫ్ స్పాన్ ను పెంచుకోవచ్చు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళు కూడా ఓ టీంను బలభద్రపురం పంపారు. పర్యావరణ అంశాలు క్యాన్సర్ కు కారణం అంటే లంగ్స్, స్కిన్ ఎఫెక్ట్ కావాలి. ఆ తరహా క్యాన్సర్లు అక్కడ డయాగ్నోజ్ కాలేదు. ఇదే అంశంపై సీఎం కూడా రివ్యూ చేశారు.

## కర్నూలు మేయర్ పీఠంపై కన్ను

కర్నూలు : కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ లో రాజకీయం రసవత్తరంగా మారబోతోంది. మేయర్ పీఠంపై కన్నేసిన టీడీపీ త్వరలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. మార్చి 19తో మేయర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కావడంతో ప్రస్తుత మేయర్ పై అవిశ్వాసం పెట్టే దిశగా టీడీపీ వ్యూహాలు రచిస్తోంది. ఇక కర్నూలు మేయర్ కార్పొరేషన్ లో 52 కార్పొరేటర్లకు గాను ప్రస్తుతం టీడీపీకి ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి 24 మంది సభ్యులు ఉన్నారు. గతంలో 52 లో 43 డివిజన్లు గెలిచిన వైసీపీ.. మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అయితే ఇటీవల ఆరుగురు కార్పొరేటర్లు టీడీపీతో టచ్ లో ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ ఆరుగురు వైసీపీకి దూరమైతే ఆ పార్టీ సంఖ్యా బలం 37కి పడిపోనుంది. ఈ క్రమంలో మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ పావులు కదుపుతోంది. పీఠాన్ని కోల్పోకుండా ఉండేందుకు వైసీపీ వ్యూహాలు రచిస్తోంది. కర్నూలు నగర మేయర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తైంది. దీంతో టీడీపీ కూటమి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. మేయర్ గా బీవై రామయ్య పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కూటమి సన్నద్ధమైంది. మూడు నియోజకవర్గాలకు సంబంధించిన కార్పొరేటర్లు కర్నూలు నగరానికి ఉన్నారు. మొత్తం 52 కార్పొరేటర్లు ఉన్నారు. 36 మంది కర్నూలు నగరానికి సంబంధించిన వారు, 16 మంది పాణ్యం నియోజకవర్గం, ముగ్గురు కోడుమూరు నియోజకవర్గానికి చెందిన వారు ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నారు.

## ఏపీలో ఆస్తి పన్ను బకాయి దారులకు.....
## గుడ్ న్యూస్




అమరావతి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 25: ఏపీలో ఆస్తి పన్ను బకాయిదారులకు మున్సిపల్ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. ఆస్తి పన్నుపై వడ్డీలో రాయితీ ప్రకటిస్తూ మున్సిపల్‌శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరు వరకు పెండింగ్‌లో ఉన్న వడ్డీ బకాయిల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ మంగళవారం జీవో జారీ చేసింది. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పేరుకు పోయిన కోట్లాది రూపాయల ఆస్తి పన్ను బకాయిల వసూళ్ల కోసం వడ్డీ రాయితీ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

## మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

గుంటూరు : చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజని, నరసరావుపేట టిడిపి ఎంపీ లావు కృష్ణదేవరాయలు మధ్య పరస్పర ఆరోపణలు జోరుగా సాగుతున్నాయి. వైసీపీలో హయాంలో ఆరోగ్యశాఖ మంత్రిగా మొన్న విడదల రజిని తన నియోజకవర్గంలో స్టోన్ క్రషర్స్ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేశారంటూ ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. రేపో మాపో విడదల రజని అరెస్టు తప్పదు అంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై భగ్గుమన్న రజని టిడిపి నేతలపై ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుత నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు తనపై కక్ష కట్టారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానికంగా ఉన్న స్టోన్ క్రషర్ యజమాని నుండి రెండు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేశారనేది ఆమెపై ఉన్న ఆరోపణ. మాజీ మంత్రి విడదల రజని చేసిన ప్రధాన ఆరోపణ తన కుటుంబాన్ని ప్రస్తుత ఎంపీ లావు కృష్ణదేవరాయులు టార్గెట్ చేశారని తన ఫోన్ కాల్ డేటాను సేకరించే ప్రయత్నం కూడా గతంలోనే చేశారని జర్మనీలో ఉంటున్న తన మరిది ని కూడా కేసుల్లో ఇరికించే కుట్ర జరుగుతుందని. నిజానికి ఒకప్పుడు కృష్ణదేవరాయలు కూడా వైసిపి ఎంపిగానే ఉండేవారు. అప్పటినుంచే వారిద్దరి మధ్య విభేదాలు ఉన్నాయి. 2020లో గురజాల పోలీస్ స్టేషన్లో తనకు అవమానం జరిగిందని దాని వెనక అప్పటి వైసీపీ ఎంపీ కృష్ణదేవరాయల అధికార దుర్వినియోగం ఉందని రజని ఆరోపించారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు నేపథ్యంలో కృష్ణదేవరాయలు టిడిపిలోకి రావడం నరసరావుపేట ఎంపీగా గెలుపొందడం జరిగిపోయింది. మరోవైపు వైసీపీ ఓటమి పాలయ్యింది. అప్పటినుంచి తనను కేసుల్లో ఇరికించే కుట్రలు ఎక్కువ అవుతున్నాయని విడదల రజని ఆరోపిస్తున్నారు. తనపై విడదల రజని చేసిన ఆరోపణలకు ఢిల్లీలో ఎంపీ లావు కృష్ణ దేవరాయలు కౌంటర్ ఇచ్చారు. తనకు బూతులు రావని, మాజీ మంత్రి రజినీలా అబద్దాలు ఆడడం రాదని ఆయన అన్నారు. రజిని కాల్ డేటా సేకరించి ప్రయత్నం తాను చేయలేదని తన ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని వాళ్ళకో న్యాయం రజనీ కో న్యాయం అంటూ ఉండదని చెప్పుకొచ్చారు. రజినీ మాటలు వెనక ఎవరున్నారో తనకు తెలుసని చెప్పిన కృష్ణదేవరాయలు ఎవరో స్టోన్ క్రషర్ యజమాని ఇచ్చిన కంప్లైంట్ కు తనకు సంబంధం ఏంటని అన్నారు. తమ చాలా ఏళ్లుగా విద్యాసంస్థలు నడుపుతున్న ప్రభుత్వం నుంచి భూమిని తీసుకున్న సందర్భమే లేదని అన్నారు. పది రోజుల క్రితం విడదల రజని ఒక మధ్యవర్తి ద్వారా కేసులు నుంచి తనని తప్పించమని రాయబారం నడిపిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. స్టోన్ క్రషర్ యజమాని నుండి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని చెప్పిన మాట నిజమో కాదో రజిని చెప్పాలని ఆయన అన్నారు. చేసిందంతా చేసి ఇప్పుడు ఇలా తనపై విమర్శలు చేయడం కరెక్ట్ కాదని చట్టం తన పని తాను చేసుకు పోతుందని కృష్ణదేవరాయలు మాజీ మంత్రికి కౌంటర్ ఇచ్చారు. తను వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఎవ్వరి పైనా ఎలాంటి విమర్శలు చేయలేదని తనను అనవసరంగా రెచ్చగొట్టొద్దని ఆయన స్పష్టం చేశారు. మరి రానున్న రోజుల్లో ఈ వివాదం ఇంకెన్ని టర్న్లు తీసుకుంటుందో చూడాలి.

## శాపంగా మారిన సిన్సియారిటీ...

గుంటూరు : సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణకు ఇక మంత్రి పదవి దక్కే అవకాశాలు లేవు. ఎందుకంటే ఇప్పటికే కాపు సామాజికవర్గం కోటాలో అనేక మంది ఉండటంతో ఆయనకు ఈ టర్మ్ లో మంత్రిపదవి దక్కడం అనేది అసంభవమేనని చెప్పాలి. ఇటు జనసేన, అటు బీజేపీ, మరొకవైపు టీడీపీలోనూ కాపు సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎమ్మెల్సీ పదవుల విషయంలోనూ, మంత్రి పదవుల విషయంలోనూ కాపులకే ఈ మూడు పార్టీలు ఇప్పటికే ప్రాధాన్యత ఇచ్చాయి. దీంతో కన్నా లక్ష్మీనారాయణకు ఒకవేళ విస్తరణ జరిగినా మంత్రి పదవి దక్కే అవకాశం దాదాపు శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే చంద్రబాబు కేబినెట్ లో ఇప్పటికే నలుగురు కాపు సామాజికవర్గానికి చెందిన వారుండటంతో పాటు నాగబాబుకు కూడా మంత్రి పదవి ఇస్తే ఐదుగురు అవుతారు. పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్ జనసేన నుంచి మంత్రి వర్గంలో ఉండగా, నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ టీడీపీ నుంచి ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ పోస్టుల్లోనూ జనసేన నాగబాబుకు అవకాశమివ్వగా, బీజేపీ అదే సామాజికవర్గానికి చెందిన సోము వీర్రాజుకు ఇచ్చింది.


లయన్స్ ఇంటర్‌నేషనల్
లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్
District - 317E Region - 5 Zone - 1 Club No. 148653
కుప్పం, చిత్తూరు జిల్లా, ఆం.ప్ర.
మరియు
వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైట్ ఫీల్డ్, బెంగళూరు
P.N. Lokseh, Coordinator,
Vydehi Institute of Medical Sciences & Research , Bangalore
వారి సౌజన్యముతో
ఉచిత గుండె పరీక్ష మరియు నాడీవ్యవస్థ శిబిరము
విశేష నిపుణులైన వైద్యులచే ఉచిత హృదయ పరీక్షా శిబిరము ఏర్పాట్లుచేయడమైనది.
ఈ శిబిరమును సద్వినియోగము చేసుకొనమని కోరుచున్నాము.
ఉచిత విశేష సౌలభ్యాలు
వైద్యులను సంప్రదింపు
బి.పి. (రక్త ఒత్తిడి)
ఎకో స్క్రీనింగ్
MISSION CPR
హృదయ రోగం లక్షణాలు
గుండె మంట, గుండె నొప్పి
గుండెలో గుచ్చుట, ఆయాసం,
ఊపిరాడకపోవుట
తేది - 29.03.2025, శనివారం
సమయం
ఉ॥ 10.00 - మ॥ 2.00 గం॥లకు
స్థలము
BRD మల్టీస్పెషాలిటీ హాస్పిటల్
R&B గెస్ట్ హౌస్ ఎదురుగా, నేతాజీరోడ్డు, కుప్పం.
గమనిక :- 1.) వైద్య శిబిరమునందు పాల్గొనువారు ఖచ్చితముగా మాస్కు ధరించవలెను.
2.) ఆధార్ కార్డు లేక ఆరోగ్యశ్రీ కార్డు తప్పక తీసుకొని రావలెను.
LEO FUTURE
KUPPAM ENGINEERING COLLEGE
LEO AMIGOS
KUPPAM DEGREE COLLEGE



## రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' సినిమాకు ఆస్కార్ ప్రకటించిన సమయంలో భావోద్వేగానికి గురయ్యా: దీపికా పదుకొణె


ప్రముఖ బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ఇటీవల ఆస్కార్ అవార్డులపై తన అభిప్రాయం వ్యక్తం చేసింది. 2023లో ఆస్కార్ అవార్డులకు హాజరై వార్తల్లో నిలిచిన దీపికా.. భారతీయ చిత్రాలకు ఆస్కార్ అవార్డులు దక్కకపోవడంపై విచారం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేసింది. ఇటీవల 'ఆల్ వుయ్ ఇమాజిన్ యాజ్ లైట్', 'మిస్సింగ్ లేడీస్' అనే భారతీయ చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా పలు వేదికలపై ప్రశంసలు అందుకున్నాయి. ఈ చిత్రాలు ఆస్కార్ 2025 తుది జాబితాలో చోటు దక్కించుకోలేకపోయాయి. ఈ చిత్రాలు భారతీయ అభిమానుల హృదయాలను గెలుచుకున్నాయి. దీపిక సోషల్ మీడియాలో ఆస్కార్ అవార్డులపై ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చింది. 'మీకు ఏ ఆస్కార్ ప్రత్యేకమైంది?' అని ప్రశ్నించగా.. అడ్రియన్ బ్రాడీకి అవార్డు దక్కడంపై సంతోషంగా ఉన్నట్లు తెలిపింది. 'ది బ్రూటలిస్ట్' అనే చిత్రానికి అడ్రియన్ రెండోసారి ఆస్కార్ అవార్డును గెలుచుకున్నారు. అంతకు ముందు 2003లో 'ది పియానిస్ట్' చిత్రానికి అవార్డును అందుకున్నాడు. మేకప్ సెషన్‌లో మాట్లాడుతూ అడ్రియన్ బ్రాడీకి ఆస్కార్ దక్కడంపై సంతోషంగా ఉన్నట్లు పేర్కొంది. భారతీయ చిత్రాలకు దక్కకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. భారత్ చాలాసార్లు ఆస్కార్ అవార్డులను కోల్పోయిందని పేర్కొంది. అవార్డుకు అర్హత ఉన్న అనేక సినిమాలు వచ్చాయని.. కానీ వాటన్నింటిని విస్మరించినట్లు పేర్కొంది. 2023లో ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఆస్కార్ అవార్డు గెలిచిన సందర్భంలో భావోద్వేగానికి గురైనట్లు చెప్పింది. ఆ సమయంలో తాను కూడా ప్రేక్షకులతో కలిసి కూర్చున్నానని.. ఆర్ఆర్ఆర్ చిత్రానికి ఆస్కార్ ప్రకటించిన సమయంలోనే భావోద్వేగానికి గురయ్యానని.. తనకు ఇది ప్రత్యేకమైన క్షణాలు అని పేర్కొంది. ఆ చిత్రంలో తాను భాగం కాకపోయినా భారతీయురాలిగా ఈ విజయం గొప్పదని తెలిపింది. 2023 ఆస్కార్ అవార్డుల వేదికలో దీపిక ప్రజెంటర్‌గా వ్యవహరించింది. నాటు నాటు సాంగ్ ఉత్తమ ఒరిజినల్ సాంగ్‌గా ఆస్కార్‌ను దక్కించుకుంది. ఇక దీపికా పదుకొనే చివరగా 'సింగం రిటర్న్స్‌లో కనిపించింది. మళ్లీ కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లో కనిపించనున్నది.

## ఉగ్రవాదులు సముద్రం ద్వారా చొరబడతారు.. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : రజనీకాంత్



సముద్రతీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపర్ స్టార్ రజనీకాంత్ (%ఖుయఅఱఅఱఖుత్ష్ణ%) విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొత్త వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా దేశంలోకి చొరబడే అవకాశం ఉందని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు.మన దేశ కీర్తిని దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా చొరబడి విధ్వంసం సృష్టిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 26/11 ముంబై ఉగ్రదాడి ఘటనను రజనీకాంత్ ఉదహరించారు. ఈ దాడి ఘటనలో సుమారు 175 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అందువల్ల సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 100 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు (%జ×ూఖీ ంశీశ్రీఏఱవతీం%) పశ్చిమ బెంగాల్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 7 వేల కిలోమీటర్ల సైకిల్ ప్రచార యాత్ర చేపట్టనున్నారని తెలిపారు. వారు మీ ప్రాంతాలకు వచ్చేటప్పుడు స్వాగతించాలని సూచించారు. కుదిరితే వారితో కొంచెం దూరం వెళ్లి వారికి సహకరించాలని కోరారు.

## శ్రీలంకలో సాంగ్ షూట్



సక్సెస్, ఫెయిల్యూర్‌లకు సంబంధం లేని స్టార్‌డమ్ విజయ్ దేవరకొండది. సరైన సినిమా పడితే.. రికార్డులు బద్దలుకొట్టడం అతనికి పెద్ద విషయం కాదు. అలాంటి విజయం కోసం తనతో పాటు తన అభిమానులు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఆయన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'కింగ్ డమ్' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. గౌతమ్ తిన్ననూరి 'జెర్సీ' సినిమా వాణిజ్యపరంగా విజయాన్ని సాధించడంతోపాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో గౌతమ్ చేస్తున్న 'కింగ్ డమ్' సినిమా కూడా మనసుల్ని మెలిపెట్టే భావోద్వేగాలతో విభిన్నంగా ఉంటుందని తెలుస్తున్నది. 70శాతం చిత్రీకరణ పూర్తయింది. వారం రోజుల షెడ్యూల్‌ని మేకర్స్ శ్రీలంకలో ప్లాన్ చేశారు. అక్కడ ఓ లవ్‌సాంగ్‌తో పాటు కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారట. అందుకే చిత్ర యూనిట్ శ్రీలంక పయనమయ్యారు. దీనికి సంబంధించిన విజయ్ దేవరకొండ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రౌడీ ట్రెండీ సమ్మర్ వేర్‌లో ట్యస్టైల్ ఐకాన్‌గా ఈ ఫొటోల్లో విజయ్ కనిపిస్తున్నారు. మే 30న ఈ సినిమాను విడుదల చేసేందుకు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్యలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మాణం: సితార ఎంటైర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.

## తెలుగులో మాట్లాడి తెగ నవ్వించిన వార్నర్ మామ.. ఇంతకీ ఏం మాట్లాడాడంటే..!



క్రికెట్ అభిమానులకి పరిచయం అక్కర్లేని పేరు డేవిడ్ వార్నర్. ఆస్ట్రేలియా తరపున ఎన్నో అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడిన వార్నర్ ఐపీఎల్‌లోను సందడి చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున కొన్నాళ్లు ఆడిన వార్నర్ 2016లో ట్రోఫీ కూడా అందించి పెట్టాడు. ఆ తర్వాత ఇప్పటి వరకు మళ్లీ ఆ జట్టు ఐపీఎల్ ట్రోఫీ అందుకోలేకపోయింది. అయితే వార్నర్ ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టీ20 లీగుల్లో ఆడుతున్నాడు. అయితే ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఈ స్టార్ ఆటగాడిని కొనుగోలు చేసేందుకు ఒక్క ఫ్రాంచైజీ కూడా ముందుకు రాలేదు. ఇది ఆయన ఫ్యాన్స్ ని చాలా నిరాశపరిచింది.అయితే ఐపీఎల్‌కు దూరం అయినప్పటికి తెలుగు వారికి మంచి వినోదం పంచాలని డేవిడ్ వార్నర్ రాబిన్ హుడ్ అనే మూవీలో కీలక పాత్ర పోషించాడు. ఈ పాత్ర మెమోరబుల్‌గా ఉంటుందని తెలుస్తుంది. నితిన్, శ్రీలీల ప్రధాన పాత్రలలో వెంకీ కుడుముల రూపొందించిన ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే గత రాత్రి ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఆ వేడుకకి డేవిడ్ వార్నర్ కూడా హాజరయ్యారు. ఈవెంట్‌లో డేవిడ్ వార్నర్ మాట్లాడుతూ అందరికి నమస్కారం అంటూ పలకరించాడు. గత కొన్నాళ్లుగా తనపై అందరూ చూపిస్తున్న ప్రేమ, మద్దతు కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నాడు. సినీ ఇండస్ట్రీలో వచ్చేందుకు కొంచెం భయపడినట్లుగా చెప్పిన డేవిడ్ వార్నర్%ా% రాబిన్ హుడ్ టీమ్ తనకు ఎంతో సపోర్ట్ ఇచ్చిందన్నాడు. ఇక ఈ చిత్రంతో మీ కుటుంబంలో నన్ను చేర్చుకున్నందుకు ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందని తెలియజేశాడు. మూవీ టీమ్ ఎంతో కష్టపడింది కాబట్టి మూవీ పెద్ద విజయం సాధిస్తుందని తెలియజేశాడు. ఇక స్పీచ్ అనంతరం డేవిడ్ వార్నర్‌ని తెలుగులో ఏదైనా చెప్పమని అడిగారు దర్శకుడు వెంకీ. ఇందుకు "నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని వెరైటీగా చెప్పి వార్నర్ అందరిని అలరించాడు.మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై రూపొందిన ఈ చిత్రంతో డేవిడ్ వార్నర్ తెలుగు ప్రేక్షకులని ఎంతలా అలరిస్తాడో చూడాలి.

## విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నా



'దర్శకుడు వెంకీ నాకు దేవుడిచ్చిన తమ్ముడు. నామీద తనకున్న ప్రేమ ఈ సినిమాలో కనిపిస్తుంది. ఈ సినిమా రేపు విజయం సాధిస్తే.. ఆ క్రెడిట్ పూర్తిగా వెంకీ కుడుములదే. డేవిడ్ వార్నర్‌సార్ ఈ సినిమా చేయడం వల్ల సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి పెరిగింది. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నా.' అని హీరో నితిన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయిక. వెంకీ కుడుముల దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రంలో ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిథి పాత్ర పోషించడం విశేషం. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నితిన్ మాట్లాడారు. 'నన్ను ఓన్ చేసుకొని నాతో నటింపజేసిన టీమ్‌కి థ్యాంక్స్ చెబుతున్నాను. మంచి మనుషులు కలయిక ఈ సినిమా.' అని డేవిడ్ వార్నర్ అన్నారు. అనుకోకుండా చేసిన సినిమా.. అనుకున్న దానికంటే బాగా చేసిన సినిమా 'రాబిన్ హుడ్' అని శ్రీలీల చెప్పారు. 'ఈ సినిమా ఇంతబాగా రావడానికి కారణం నితిన్. అద్భుతమైన టీమ్‌ని నాకిచ్చి ముందుకు నడిపించిన నిర్మాతలకు థ్యాంక్స్. డేవిడ్ వార్నర్ సార్ చేయడం వల్ల సినిమాపై అంచనాలు పెరిగాయి.' అని డైరెక్టర్ వెంకీ కుడుముల పేర్కొన్నారు. డా.రాజేంద్రప్రసాద్, సంగీత దర్శకుడు జి.వి.ప్రకాశ్‌కుమార్, నటి కేతిక, రాహుల్ సంకృత్యన్, వివేక ఆత్రేయ, సాయిరాజేష్, కాసర్ల శ్యామ్, దేవ్ దత్, మైత్రీ శశి, హరి తుమ్మల, ప్రశాంత్ పిన్నమనేని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036